వైద్యరంగంలో పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డిని శాసనమండలి విపక్ష నేత మధుసూదనాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రులు మహమూద్ అలీ, పువ్వాడ, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి, బాల్క సుమన్, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారాం యాదవ్, దూదిమెట్ల, ఆంజనేయగౌడ్ తదితరులు

కాంగ్రెస్ కట్టుకథలు!

> సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడు సినిమాలో రాము, రెమో తరహాలో మాట్లాడుతున్నడు. జనవరి 26 నుంచి రైతు భరోసా వేస్తమని చెప్పిన ముఖ్యమంత్రి, నిన్న 17 నిమిషాల్లోనే మాట మార్చిండు. మార్చి 31 వరకు వేస్తామని నాలుక మడతేసిండ్రు. రేవంత్‌రెడ్డి మానసికస్థితి పైన అనుమానాలు వస్తున్నయ్.
> -కేటీఆర్

> కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు జనవరి 30 నాటికి 420 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇద్దాం. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కలలోకి వచ్చి బుద్ధి చెప్పేలా బాపూజీకి విజ్ఞప్తి చేద్దాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో నవమోసాలు మోసిన తల్లి పాత్ర బీఆర్ఎస్‌దైతే.. మంత్రసాని పాత్ర కాంగ్రెస్ పార్టీది.
> -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

ఆరు గ్యారెంటీలు కూడా అంతేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ 420 హామీలకు జనవరి 30వ తేదీతో 420 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో సోమవారం బీఆర్ఎస్వీ కొత్త సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను కేటీఆర్ ఆవిష్కరించి మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని రకాలుగా విద్యారంగాన్ని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. 294 ఉన్న గురుకులాలను వెయ్యికి పైగా పెంచుకున్నామని, రాష్ట్రంలో కొత్తగా 60 డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేసుకున్నామని, 2014 ముందు తెలంగాణలో ఐదు మెడికల్ కాలేజీలు ఉంటే, జిల్లాకో మెడికల్, నర్సింగ్ కాలేజీలు అందుబాటులోకి తెచ్చుకున్నామని వివరించారు. ఫారెస్ట్, హార్టికల్చర్, మహిళా యూనివర్సిటీలు ఏర్పాటు చేసుకొని మహనీయుల పేర్లు పెట్టుకున్నామని తెలిపారు. తెలంగాణ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా ఉండేలా రూ.7400 కోట్లతో 'మన ఉరు-మన బడి' కార్యక్రమం నిర్వహించినట్టు పేర్కొన్నారు.

ఒక్కరేషన్ కార్డు ఇవ్వలేదంటూ అబద్ధాలు

మనం డిజిటల్ యుగంలో ఉన్నామని, నిజం గడప దాటే లోపు అబద్ధం ఊరంతా చుట్టేస్తున్నదని కేటీఆర్ చెప్పారు. ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 13 నెలలైనా హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ నేతలంతా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఆక్షేపించారు. రేషన్‌కార్డులు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చారిత్రాత్మకమైన కార్యక్రమం అంటున్న ముఖ్యమంత్రి భావదారిద్ర్యాన్ని తెలంగాణ ప్రజలు చూస్తున్నారని విమర్శించారు. 2021లోనే తమ ప్రభుత్వం రేషన్ కార్డులు పంపిణీ చేయగా ఆ కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారని గుర్తుచేశారు. అయినా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదంటూ భట్టి అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్‌కార్డుల పంపిణీలో భట్టి పాల్గొన్న నాటి ఫొటోను మీడియాకు చూపించారు. ఆరు లక్షల 47 వేలకు పైగా కొత్త రేషన్ కార్డులిచ్చామని, దాన్ని ఏదో చారిత్రాత్మక కార్యక్రమంగా తాము చెప్పుకోలేదన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా రొటీన్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేదలకు కార్డులు అందజేశామని పేర్కొన్నారు.

బూటకపు హామీలతో వంచన

రైతు డిక్లరేషన్, విద్యార్థి డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్, బాండు పేపర్లు, అఫిడవిట్లు, గ్యారెంటీ కార్డుల పేరుతో నూరు రోజుల్లో అమలుచేస్తామని దేవుళ్ల మీద ప్రమాణాలు చేస్తూ 420 బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను వంచించారని కేటీఆర్ మండిపడ్డారు. అశోక్‌నగర్‌లో తెలంగాణ యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రాహుల్‌గాంధీ ముఖం చాటేశారని దుయ్యబట్టారు. డూప్లికేట్ గాంధీలు ఇచ్చిన దొంగ హామీలను, వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ తెలంగాణ ప్రజలకు 420 హామీలిచ్చి జనవరి 30 నాటికి సరిగ్గా 420 రోజులు అవుతున్నందున మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద నివాళులర్పించి, డూప్లికేట్ గాంధీలకు హామీలు అమలుచేసే బుద్ధి ప్రసాదించాలని విజ్ఞప్తి చేయాలని బీఆర్ఎస్వీ విభాగానికి పిలుపునిచ్చారు. బాపూజీ రాహుల్, ప్రియాంక, సోనియా కలలోకి వచ్చి బాపూజీ బుద్ధి చెప్పేలా విద్యార్థులు, యువకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోజుకో రైతు ఆత్మహత్య

కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా రాష్ట్రంలో రోజుకో రైతు బలవన్మరణానికి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన 400 రోజుల్లో 410 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. బ్యాంకుల్లోనే రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో, పాము కాట్లతో విద్యార్థులు చనిపోతున్నారని, విద్యార్థుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం గురుకుల బాట పడితే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి లేచిందని, నాలుగు రోజులపాటు హడావుడి చేసిందని, కానీ మళ్లీ గురుకులాల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లు 100 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల వైఫల్యాలను ప్రతి ఇంటికి తీసుకుపోవాలని విద్యార్థి విభాగం నాయకులకు సూచించారు.

ఏటా 1.60 లక్షల ఉద్యోగాల భర్తీ

బీఆర్ఎస్ హయాంలో రెండు లక్షల 32 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి లక్షా 60 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యామని కేటీఆర్ గుర్తుచేశారు. ఏటా 16 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, కానీ, 1000 ఉద్యోగాలు కూడా బీఆర్ఎస్ ఇవ్వలేదని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంవత్సరంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని రాహుల్‌గాంధీ చెప్పి ఇప్పటిదాకా 12వేల కొత్త ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చినమని చెప్పుకొంటున్న ఉద్యోగాలన్నీ గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి దాదాపుగా భర్తీ పూర్తిచేసినవేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎప్పటిలాగే మంది బిడ్డను తన బిడ్డ అని చెప్పుకొంటున్నదని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత విద్యార్థి విభాగంపై ఉన్నదని సూచించారు.

త్వరలోనే బీఆర్ఎస్వీ కమిటీలు

త్వరలోనే భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) కొత్త కమిటీలు వేసుకుంటామని కేటీఆర్ చెప్పారు. గ్రామ, మండల, కళాశాల, వర్సిటీ స్థాయి కమిటీల ఏర్పాటుతోపాటు ప్రత్యేక శిక్షణ పెట్టుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బాల్క సుమన్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, డాక్టర్ రాకేశ్, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, ఆంజనేయగౌడ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు శుభప్రద్‌పటేల్, రాజారాంయాదవ్, తుంగ బాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది మంత్రసాని పాత్రే

బీఆర్ఎస్ అనేది 14 ఏండ్ల పాటు అనేక బాధలు పడి, త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని కేటీఆర్ గుర్తుచేశారు. తల్లి పురిటి నొప్పులు పడి బిడ్డకు జన్మనిచ్చినట్టుగా తెలంగాణను సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కేవలం మంత్రసాని పాత్రకే పరిమితమైందన్నారు. నాడు రేవంత్‌రెడ్డి తుపాకీ పట్టుకొని తెలంగాణకు వ్యతిరేకంగా నిలబడ్డ విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలుసని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తే సంతోషిస్తామని, కానీ, అవన్నీ అవాస్తవాలనే విషయం ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. నిరుడు చెప్పిన 40 వేల కోట్ల పెట్టుబడుల్లో ఏవీ వాస్తవ రూపం దాల్చలేదని గుర్తుచేశారు. తాము తెచ్చామని చెప్తున్న పెట్టుబడులు ఎప్పటిలోగా పూర్తవుతాయో, ఎప్పటిలోగా తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయో రేవంత్‌రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిజంగానే ఈ పెట్టుబడులన్నీ వాస్తవరూపం దాలిస్తే తామే సన్మానం చేస్తామని చెప్పారు.

అపరిచితుడు రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా మారారని కేటీఆర్ విమర్శించారు. జనవరి 26 నుంచి రైతు భరోసా వేస్తామని చెప్పి నిన్న 15 నిమిషాల్లోనే మాటమార్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో 12 వేలకుపైగా పంచాయతీలు ఉంటే కేవలం 600 గ్రామాల్లో అంటే 5 శాతం గ్రామాల్లోనే పథకాలు అమలు చేస్తామని చెప్పి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు వేయించుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి గతంలో సంతకాలు పెట్టిన వాటికే దిక్కులేదని, ఇప్పుడు సంతకాలు పెట్టకుండా పథకాల అమలు అని కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్తున్న, చేస్తున్న అబద్ధాలు, మోసాలు ప్రజలకు తెలియజేయాలని బీఆర్ఎస్వీకి పిలుపునిచ్చారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పక్కన వాసుదేవరెడ్డి, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, మేడె రాజీవ్‌సాగర్, రాంచందర్‌నాయక్

కాంగ్రెస్ అంటేనే మోసం

- రాష్ట్ర ఏర్పాటు నుంచే దగా
- రైతుభరోసా కుదించి ద్రోహం
- మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 21: 'కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం.. నాడు తెలంగాణను ఆంధ్రాలో కలుపడం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా కాంగ్రెస్ ఈ ప్రాంత ప్రజలను దగా చేసింది. ఇప్పుడు అధికారం చేపట్టి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేస్తున్నది' అని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సగం మంది రైతులకు రుణమాఫీ చేసి, రైతుభరోసాను కుదించి రైతాంగాన్ని వంచించిందని విమర్శించారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవ రెడ్డి, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, మేడె రాజీవ్‌సాగర్, రాంచంద్రనాయక్‌తో కలిసి సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జనవరి 26 నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు ఇస్తామని ఊదరగొట్టిన సీఎం, మంత్రులు ఇప్పుడు 600 గ్రామాల్లోనే అమలు చేస్తామని చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు, రైతు రుణమాఫీ రూ.28 వేల కోట్లు, రైతుబీమా కింద రూ.5 వేల కోట్ల చొప్పున మొత్తంగా రూ.ఒక లక్షా ఆరువేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామని గుర్తుచేశారు. మొన్న ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వబోమన్న లగచర్ల రైతులపై, నిన్న గ్రామసభలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పలువురు నాయకులపై పోలీసులతో కొట్టించారని ధ్వజమెత్తారు.

అన్నదాతలకు బీఆర్ఎస్ అండ

కాంగ్రెస్ మోసాలకు ఏడాదిలో 400 మందికి పైగా రైతులు బలయ్యారని కర్నె ప్రభాకర్ ఆందోళన వ్యక్తంచేశారు. అన్నదాతలు అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంగళవారం నల్లగొండలో చేపట్టనున్న బీఆర్ఎస్ రైతుదీక్షకు రైతాంగం పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం గజ్జెకట్టి ఆటపాటలతో చైతన్యం నింపిన గద్దర్ అంటే బీఆర్ఎస్‌కు ఎనలేని గౌరవమని చెప్పారు.

టీబీజీకేఎస్‌కు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ నాయకులకు ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ మార్గనిర్దేశకత్వంలో 23 ఏండ్లుగా కార్మికుల పక్షాన నిబద్ధత, చిత్తశుద్ధితో యూనియన్ పోరాడుతున్నదని సోమవారం ఎక్స్ వేదికగా కొనియాడారు. దేశానికి వెలుగులు పంచే సింగరేణి పరిరక్షణే లక్ష్యంగా బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా పోరాడుతున్నదని చెప్పారు. తెలంగాణ ప్రాంత గోదావరిలోయలోని బొగ్గు గనులన్నింటినీ సింగరేణికే కేటాయించేలా కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడితేవాలని డిమాండ్ చేశారు.

గోవాలో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 27 : గోవాలో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఓబీసీ ముఖ్య సలహాదారు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమవారం గోవా మాజీ ఉప ముఖ్యమంత్రి, కురుమ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీబాబు కవ్లేకర్, ఆ రాష్ట్ర మంత్రి సుభాష్‌శిరోడ్కర్‌ను ఆయన కలిసి ఓబీసీల సమస్యలపై చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా వైద్యవిద్య, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. శ్రీబాబు కవ్లేకర్, సుభాష్‌శిరోడ్కర్ సానుకూలంగా స్పందించారు. సమాజ్ ఓబీసీ నాయకుడు బండారిగౌడ్, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మధు అనంతనాయక్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి సర్వేశ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలోనే సంక్షేమం

- కేసీఆర్ అంటే ఇష్టం.. ఆయన పాలన అందరికీ ఆదర్శం
- పదేండ్లలో రాష్ట్రం విలువను పదిరెట్లు పెంచింది కేసీఆరే
- ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తా
- 100 మందితో 140 కిలోమీటర్ల పాదయాత్ర
- సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్

మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్‌ను గులాబీ కండువా, పూలమాలతో సన్మానిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఝరాసంగం, జనవరి 27 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మేదపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ 100 మంది యువకులతో పాదయాత్ర ప్రారంభించాడు. కేసీఆర్ నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని సోమవారం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచే పాదయాత్రను జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ప్రారంభించారు. నాలుగు రోజులపాటు 140 కిలోమీటర్ల సాగే ఈ పాదయాత్ర గజ్వేల్ మీదుగా ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌కు చేరనున్నది. ఈ సందర్భంగా పరమేశ్వర్ పటేల్ మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే తనకు ఎంతో ఇష్టమని అన్నారు. ఆయన పాలన చాలా బాగుంటుందని, పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం విలువను పదిరెట్లు పెంచినట్టు కొనియాడారు. బీఆర్ఎస్ లేని లోటు రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాదయాత్రకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు రుణపడి ఉంటానని తెలిపారు.

గాంధీభవన్‌కు ఫినాయిల్ బాటిళ్లను పంపుతున్న బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజు, వాసుదేవరెడ్డి, శుభప్రద్ పటేల్, గోసుల శ్రీనివాస్ తదితరులు

400 రోజులైనా గ్యారెంటీల అమలేది?

- అమలుపై కాంగ్రెస్ నేతల పచ్చి అబద్ధాలు
- వాళ్ల నోళ్లను ఫినాయిల్‌తో శుద్ధి చేసుకోవాలి
- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్
- గాంధీభవన్‌కు ఫినాయిల్ బాటిళ్లు పంపిన నేతలు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తేతెలంగాణ): అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్.. 400 రోజులు దాటినా ఎందుకు అమలు చేయడంలేదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. పొద్దున లేస్తే పచ్చి అబద్ధాలు చెప్తున్న కాంగ్రెస్ నాయకులు తమ నోళ్లను ఫినాయిల్‌తో కడుక్కొని శుద్ధిచేసుకోవాలని, ఇందుకోసం గాంధీభవన్‌కు తామే ఫినాయిల్ బాటిళ్లను కొరియర్ ద్వారా పంపుతున్నామని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజుయాదవ్, వాసుదేవారెడ్డి, శుభప్రద్ పటేల్, గోసుల శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 13 నెలల కాంగ్రెస్ పాలనలో నిరుపేదలకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. 12 గంటల్లో రైతుల ఖాతాల్లో రైతుభరోసా నగదు వేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 24 గంటల్లో ఎంతమంది రైతులకు నగదు అందించారో చెప్పాలని ప్రశ్నించారు. అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ సర్కారు కాలం వెళ్లదీస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా అబద్ధాలు మాని, విలువలతో కూడన రాజకీయాలు చేయాలని హితవు పలికారు. లేదంటే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

28లోగా కౌంటర్ దాఖలు చేయండి

- జీవో 46పై ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం జారీచేసిన జీవో 46పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఆ జీవో బాధితులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాడుకుని వదిలేయడం దుర్మార్గమని పిటిషనర్, బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి వాదించారు. 23 సార్లు అవకాశమిచ్చినా కౌంటర్ దాఖలు చేయకలేదని, వారికి వెంటనే న్యాయం చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ.. కౌంటర్ దాఖలుకు రెండు నెలల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. వచ్చే నెల 28లోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పల్లాను ఎదుర్కోలేకే కుట్రలు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతున్నదని ఏనుగుల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా ఎర్రగుంట తండాలో ఆదివారం జరిగిన లాఠీచార్జి కాంగ్రెస్ వికృత రాజకీయకు అద్దం పడుతున్నదని మండిపడ్డారు.ప్రజలు తిరగబడ్డ నాడు లాఠీలు, తూటాలు ఆపలేవని హెచ్చరించారు.

పూల రవీందర్‌కు గురుకుల టీచర్ల మద్దతు

హైదరాబాద్, జనవరి27 (నమస్తే తెలంగాణ): వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌కు టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్ దయాకర్ సోమవారం ప్రకటన విడుదల చేశారు.

మేయర్ సునీల్‌రావుపై కలెక్టర్‌కు అందించే అవిశ్వాస నోటీసును చూపిస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కరీంనగర్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నోటీసులు
- వ్యతిరేకతను తెలిపేందుకే: బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 27: కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావుపై సోమవారం బీఆర్ఎస్ కార్పొరేటర్లు కలెక్టర్ పమేలా సత్పతికి అవిశ్వాస నోటీసులు అందజేశారు. ఇటీవల మేయర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరడంతో ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అవిశ్వాస నోటీసులు అందించింది. ఆ నోటీసులపై బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపా రాణి హరిశంకర్‌తో కలిసి 26 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతోపాటు ఆరుగురు కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు సైతం సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు రాజేందర్‌రావు, మహేశ్, మాధవి, స్వరూపారాణి మాట్లాడుతూ.. పార్టీ మారిన మేయర్‌పై ఎంత వ్యతిరేకత ఉన్నదో ప్రజలకు తెలిపేందుకే ఈ అవిశ్వాస నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. మంగళవారంతో పాలకవర్గ పదవీకాలం ముగుస్తుందన్న విషయం తెలుసని, మేయర్ తీరుపై కార్పొరేటర్లు ఎంత వ్యతిరేకంగా ఉన్నారో చెప్పేందుకే ఈ చర్య తీసుకున్నామని స్పష్టం చేశారు. అవినీతిపరుడైన సునీల్‌రావు స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సరికాదని హితవుపలికారు. మాజీ మేయర్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ.. తమ పార్టీలో చేరాలంటే పదవులకు రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారని, ఇప్పుడు సునీల్‌రావును మేయర్ పదవికి రాజీనామా చేయకుండా ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

హాస్టల్‌లో విద్యార్థి మృతి

- స్టడీ అవర్‌లో ఫిట్స్.. అక్కడికక్కడే కన్నుమూత
- వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో విషాదం
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- న్యాయం చేయాలి: నిరంజన్‌రెడ్డి



మృతుడు భరత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, జనవరి 27 : హాస్టల్ విద్యార్థి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్నది. ఏదుట్ల గ్రామానికి చెందిన ఉడుముల వెంకటస్వామి అరుణ పెద్ద కుమారుడు భరత్